# అధిక్షేప సాహిత్యం

ఆచార్య జి. అరుణ కుమారి
తెలుగు శాఖ,
హెడ్,& కో ఆర్డినేటర్
ప్రాచీన తెలుగు సాహిత్య అధ్యయన కేంద్రం
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

అధిక్షేపం అనే పదానికి – దూఱుట, నిందించుట, త్రోసిపుచ్చుట, తిరస్కరించుట, స్థాపనము, పురికొల్పుట, ప్రేరణము అని సూర్యరాయాంధ్ర నిఘంటువు అర్థాలనందించింది. అధిక్షేపం అనే పదానికి 'నిరసనము, విమర్శనము, ఉపాలంభనము, విడంబనము, హేళనము, దూషణము అనునవి ఛాయా మాత్రముగా పర్యాయవాచి పదములని డా॥ కె. గోపాల కృష్ణారావు 'అధిక్షేప శతకములు' అనే గ్రంథములో పేర్కొన్నారు. ప్రాచీన కావ్యాల్లో అధిక్షేప పదం భిన్నార్థాల్లో ప్రయోగించారు.

**"గంధర్వుల బంధించి గుహ్యకుల సంహరించి**
**యక్షుల నధిక్షేపించి కేచరుల గీటడంచి"**

(హరవిలాసం, మూడవ ఆశ్వాసం 9వ పద్యం)

పాఱద్రోలు అనే అర్థంలో అధిక్షేపించే పదాన్ని ప్రయోగించారు.

**దుర్మదంబున ద్రోణాచార్యుల నధిక్షేపించవచ్చునంతియ గాక...దుర్జయుండగు నర్జునకు దల సూప వచ్చునే"** (విరాట, 4 ర, 195 వచనం)

**ఆక్షేపించు** అనే అర్థంలో అధిక్షేపించు పదాన్ని ప్రయోగించారు.

**అందఱు గూడి యొక్కట నచ్చేడియ మీద నధిక్షేపించి**

(హరివంశం పూర్వభాగం 5 ఆ, 227 వచనం)

దోషమారోపించు, నేరం మోపటం అనే అర్థంలో అధిక్షేపించు పదాన్ని ప్రయోగించారు.

**వేట పంతంబు దప్పిమమ్ము నధిక్షేపించితి**

**వీ తప్పునకు దపసివి గాన నిన్ను శిక్షింపను**

(హరి విలాసం 7వ ఆశ్వాసం, 61 పద్యం)

త్రోసి పుచ్చావు అనే అర్థంలో అధిక్షేప పదాన్ని ప్రయోగించారు...పోషక ప్రభువులు, అధికారులు, విభిన్న రంగాలకు చెందిన వ్యక్తులు, కవి పండితులు, ఆప్తులు మున్నగువారిని గురించి నిరసన దృష్టితో ఆశువుగా చెప్పిన పద్యాలు, చాటువులు, శతకాలు ప్రాచీన సాహిత్యంలో వెలువడ్డాయి. సాంఘిక దురాచారాలను నిరసిస్తూ, కవితా ధోరణులను, కవితలను అధిక్షేపిస్తూ తెలుగు సాహిత్యంలో అధిక్షేపం చోటు చేసుకుంది.

వేములవాడ భీమకవి, మేధావి భట్టు, బడబానల భట్టు అధిక్షేపాత్మక చాటు పద్యాలు రచించారు. అధిక్షేప రచనలకు చక్కని పునాదులు వేసిన కవి శ్రీనాథుడు. వేటూరి ప్రభాకర శాస్త్రి సేకరించిన చాటువులను చాటు పద్య మణిమంజరి, చాటుపద్య రత్నాకరముల రూపంలో సంకలనం చేసినవి అధిక్షేప రచనలే.

శ్రీనాథుని చాటువులు చమత్కారానికి ప్రసిద్ధమైనవి. కొన్ని చాటువులు నవ్విస్తాయి. కొన్ని గిల్లినట్టు ఉంటాయి. కష్టాన్ని, వ్యతిరేకతను, నిషేధాన్ని అందంగా చమత్కరించగల ప్రతిభ శ్రీనాథుని చాటువులలో గమనించవచ్చు.

**"సర్వజ్ఞ నామధేయము**
**శర్వునకే రావు సింగ భూపాలునకే**
**యుర్విం జెల్లును దక్కొరు**
**సర్వజ్ఞుడనుట కుక్క సామజమనుటే"**

రెడ్డిరాజుల శత్రువు అయిన సింగ భూపాలుడిని స్తుతించినట్లుగాను, నిందించినట్లుగాను చమత్కరించగలిగే చాటువు అది. రాజులపై నిరసన చూపిన ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర శతకంలో...

**"రాజల్ మత్తులు వారిసేవ నరక ప్రాయంబు, వారిచ్చు నం**
**భోజాక్షీ చతురంతయాన తురగీ భూషాదులాత్మ వ్యథా**
**బీజంబుల్, తదపేక్ష చాలు పరితృప్తింబొందితిన్ జ్ఞానల**
**క్ష్మీ జాగ్రత్ పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!"**

అని రాజుల చిత్తవృత్తిని అధిక్షేపించి జ్ఞాన పరిణామం వలన సత్యాలను తెలుసుకుంటే చాలని భగవంతుడిని దయతో చూడమని అర్థించాడు.

నిత్య జీవితంలో ఎదురుపడిన అనేకాంశాలను నిశిత దృష్టితో పరిశీలించి వ్యంగ్యాత్మకంగా భావ ప్రకటన చేసిన వారు అధిక్షేప కవులు. దూషణలు, హేళనలు, ఎత్తి పొడుపులు, మందలింపులు, నిరసనల మూలంగా సమాజంలో మార్పులను సంస్కరణలను అధిక్షేప సాహిత్యకారులు ఆశించారు. అధిక్షేప చాటువులను అనుసరించి అధిక్షేప శతకాలు వెలువడ్డాయి. హాస్య శతకాలు చమత్కారంతో కూడుకొని ఉన్నా అందులోనూ అధిక్షేపం ఉంటుంది.

శతక కవులు నైతిక విలువలను, ముక్తిని సాధించే మార్గాలను ఉపదేశిస్తూ నిరసన భావాన్ని అధిక్షేప రూపంలో వ్యక్తీకరించారు. దుర్జన లక్షణాలను కలియుగ ధర్మాలను నిరసిస్తూ అధిక్షేపాత్మక పద్యాలను రచించారు. తెలుగులో మొదటి అధిక్షేప శతకం *కూచిమంచి తిమ్మకవి కుక్కుటేశ్వర శతకం*, వేమన పద్యాలలోను అధిక్షేపం చిత్రవిచిత్ర గతులలో కొనసాగుతుంది. కందంబులు సకల జనానందంబులు అని కంద పద్యాన్ని కదను తొక్కించిన కవితా శిల్పి కవి చౌడప్ప. 'చౌడప్ప శతకం'లో వ్యక్తుల చిత్తవృత్తిని,

నైతికతను సాంఘిక వ్యవస్థను ప్రధానాంశాలుగా స్వీకరించి అధిక్షేప శతకాలను రచించాడు.

**ఇయ్యగ నిప్పింపంగల**
**యయ్యలకే గాని మీస మందఱికేలా**
**రొయ్యకు లేదా బారెడు**
**కయ్యమునకు గుందవరపు కవి చౌడప్పా!**

(చౌడప్ప శతకం, 40 పద్యం)

సమాజంలో దొర దగ్గర పని చేసేవారి నైజాన్ని, కరణాల చిత్తవృత్తిని, సజ్జన నీతిని, పసగల అనేకాంశాలను ఈ శతకంలో వర్ణించారు. పోలిపెద్ది వేంకటరాయకవి వేణుగోపాల శతకంలో సామాజిక వ్యవస్థలోని వివిధ రంగాలను కన్నులకు గట్టినట్టు వర్ణించారు. జానపదం, వివిధ వృత్తులు, వేషభాషలను వర్ణించాడు. కూచిమంచి తిమ్మకవి భర్గ శతకంలో రాజులను, వారి నాశ్రయించిన కవి పండితులను, దూషించాడు. కవి పండిత బుధ జన తిరస్కారం, లోభగుణం, కుకవుల దుర్వర్తనం, వితరణ గుణవిహీనులైన వారిని విమర్శించాడు, దూషించాడు.

**'కవితల్ కాసుకు గంపెడయ్యె'** (పద్యం 85), **దుర్వ్యాపార ప్రభులు** (పద్యం 77)**, అవివేక క్షితినాయకాధమ** (పద్యం 86)**, రాజాంతే నరకం వ్రజేత్ అనుట** (పద్యం **73),** అధిక్షేప దృక్పథానికి నిదర్శనాలు.

**భోజుంబోలి సమస్త యాచక తతిం బోషించుచుండన్ వలెన్**
**తేజం బెప్పుడు నుర్విలో బ్రజకు జెందింపన్ వలెన్ గానిచో**
**రాజావాడు? తరాజుగాక! భువిభర్గా! పార్వతీ వల్లభా!** (పద్యం 74)

కూచిమంచి జగ్గకవి భక్త మందార శతకంతోను రాజుల లోభత్వాన్ని వితరణ గుణాన్ని వర్ణించాడు.

**దానం బిల్లె, దయారసంబు నహి, సద్ధర్మంబుతీర్, మీ పద**
**ధ్యానంబున్ గడులొచ్చు సత్యవచన వ్యాపారముల్ సున్న సు**
**జ్ఞానం బెంతయు నాస్తి సాధుజన సన్మానేచ్ఛ లేదన్న నీ**
**క్షమానాథాధమకోటి కేది గతి రామా! భక్త మందారమా!**

(పద్యం 8**3)**

గుణాలు లేవనడానికి ఇల్లె, నహి, తీర్, లొచ్చు, సున్న, నాస్తి, లేదు అనే వ్యతిరేక పదాలను ప్రయోగించాడు. రాజులు గుణహీనులు అని గుణరాహిత్యాన్ని అధిక్షేపించారు.

విషయాల పట్ల విమర్శనాత్మక దృష్టితో వ్యంగ్య హాస్య ధోరణిలో వ్యాఖ్యానిస్తూ పరిష్కారాలనందించే సాహిత్య ప్రక్రియగా అధిక్షేప సాహిత్యం నిలుస్తుంది. వ్యక్తి, సమాజం, వ్యవస్థలోని లోటుపాట్లను విమర్శించి ఖండించి చమత్కారాన్ని, హాస్యాన్ని, వ్యంగాన్ని పోషించగల ప్రక్రియ ఇది. రచనలో కొంతభాగం అధిక్షేప రచనగా కొనసాగచ్చు లేదా రచన మొత్తం అధిక్షేప రచనగా కొనసాగవచ్చు. సమాజంలోని సమస్యలను ప్రత్యక్షంగా ఎదుర్కొంటు అధిక్షేపించవచ్చు. ఈ సందర్భంలో అధిక్షేప రచన శైలి కటువుగా ఉండవచ్చు. కీలెరిగి వాత పెట్టినట్టుగ లోపాలను ఎత్తిచూపటం అధిక్షేప సాహిత్య ప్రక్రియా లక్షణం. అధిక్షేప రచనలలో నిరసన, నిషేధ పద్ధతులున్నాయి. ఉపదేశాలను సామాన్య రీతిలో ఉపదేశించటం కన్న ఉపాలంభన (మర్మంగా దూషించటం) అధిక్షేపరూపంలో చెప్పినప్పుడు దానికి విలువ, ప్రభావం ఎక్కువ. సమాజ సంస్కరణకు ఈ ప్రక్రియ తోడ్పడింది. కవుల పాండిత్య ప్రతిభా విశేషాలను ప్రకటించే సాహిత్య ప్రక్రియగా నూతన ధోరణులను ప్రకటించే సాహిత్య ప్రక్రియగా నూతన ధోరణులను చేపట్టి దుర్మార్గాన్ని

ఖండించి, ఆదర్శాలను సూచించి నిరసన, వ్యంగ్య, హాస్య, దూషణలతో ప్రత్యక్ష పరోక్ష రీతులలో అధిక్షేప రచనా ప్రక్రియ రూపు దాల్చింది.

భావానుగుణమైన భాష, మాండలికాలు, నూతన పదాలు, పదబంధాలు, నుడికారాలు, సామెతలు, లోకోక్తులు, ఉపమానాలు అధిక్షేప రచనకు శక్తిని పుష్టిని చేకూరుస్తాయి. బూతులు ప్రయోగించడం కూడా అధిక్షేప రచనలో కనిపించే విలక్షణ మార్గం. దీనికి చౌడప్ప శతకం ఒక ఉదాహారణ. అలంకారాత్మక గోప్య దూషణానికి అనగా ఉపాలంభనకి శ్రీకాకుళాంధ్ర మహా విష్ణువు శతకాన్ని ఉదాహరణగా స్వీకరించవచ్చు. విడంబనము అనగా అనుకరణ. దీనికి పేరడీలను ఉదాహరణగా సూచించవచ్చు.

పుల్లమరాజనే నామాంతరమున్న కాసుల పురుషోత్తమ కవి ఆంధ్ర నాయక శతకం, హంసల దీవి వేణుగోపాల శతకం ఎత్తి పొడుపులకు పేరెన్నిక గన్నవి.

భార్యగా భూదేవి నిర్వాహకురాలైనా మోసేవాడివని నీకు పేరు వచ్చింది. లక్ష్మీదేవి భార్య కావడం వలన కోరికలు తీర్చేవాడవని పేరు వచ్చింది. సృష్టి కర్త బ్రహ్మ నీకు కొడుకు కావటం వలన బహుకుటుంబీకుడవన్న పేరు నీకు వచ్చింది. పాపాలను కడిగే గంగ కూతురు కావడం వలన పతిత పావనుడవనే పేరు నీకు వచ్చింది. ఇలా భార్యల వలన, పిల్లల వలన పేరు గడించావు కాని మొదటి నుండి నువ్వు దామోదరుడవె అంటే నిష్ప్రయోజకుడవనే నిందార్థంలో వాఖ్యానించాడు కవి. ఉదరంపై మాల గలవాడు విష్ణువు అనే దామోదర పద అర్థానికి నిష్ప్రయోజకుడనే అర్థం ఉంది.

**''నాగలి రోకలన్నకు నిచ్చి శంఖాది**
**పంచాయుధము లీవు పట్టినావు**
**తాటి టెక్కంబు కోల్తల పెద్ద కెత్తించి**
**గరుడ ధ్వజం బీవు గట్టినావు**
**వెలరాని కఱవోని వలువ జ్యేష్ఠున కిచ్చి**

**రత్నాంబరం బీవు గట్టినావు**

**మద్య మగ్రజునకు మత్తిల ద్రావించి**

**జున్నుబాల్ పేర్గీవు జుట్టినావు** **(36 పద్యం)**

**తే॥ తగవరివె యన్న దమ్ముల ధర్మ మీవె**

**తీర్చ వలెగాని మఱియొండు తీర్చగలడె?**

అన్నకు నాగలి, తాటిచెట్టు పతకం, వెలరాని వలువలు, మద్యం ఇచ్చి నీవు శంఖ చక్రాలు, గరుడ ధ్వజం, పట్టు వస్త్రాలు జున్నుపాలు పెరుగు అనుభవించావు. అన్నదమ్ముల పంపకాలు నీవే తీర్చాలి మరి అన్న వ్యంగ్యం కనిపిస్తుంది.

**''వ్యాకరణం తోకుచ్చుకు**

**కాకువు లూరేగుతారు కానీ, సుకవుల్**

**వ్యాకృతి ఆకృతి మార్చే**

**సే కావ్యాలల్లగలరు సిరిసిరి మువ్వ''**

అని ఆనాటి వ్యాకరణ ఛందో రీతులకున్న ప్రాధాన్యతను, వాటిని ఆశ్రయించిన కవులను సిరిసిరిమువ్వ శతకంలో అధిక్షేపించారు శ్రీశ్రీ.

మల్లవరపు జాను రాజకీయ పార్టీ గూండాల పరమయ్యింది. జెండా వాడిపోయాయి. జెండా కర్రలు మిగిలాయి. అవి గూండాల చేతికి మిగిలాయి. ప్రజలకు గండాలే మిగిలాయి అని పద్యారామంలో వివరించారు.

**జెండా కర్రలనుండిన**

**జెండాల్ మటుమాయమయ్యె – జెండా కర్రల్**

**గుండాల చేతులం బడె,**

**గండములై పోయె ప్రజల కమ్మని బ్రదుకుల్**

(పద్యారామం, పుట 101)

సంప్రదాయాన్ని అధిక్షేపిస్తూ వచ్చిన గేయాలు శ్రీశ్రీ మరో ప్రస్థానం – ఝంఝంలో

**భూతకాలం చూరు పట్టుకొని**

**విలువలకి వింత వ్యాఖ్యానాలు చేస్తున్నారు**

**పాతని బతికించడానికి**

**కొత్త చిట్కాలు వెదుకుతున్నారు**

**కొత్తవి హతమార్చడానికి**

**పాత కత్తులు నూరుతున్నారు (ఝంఝ)**

కారుణిక హాస్యంతో కూడిన అధిక్షేప కవిత్వం కుందుర్తి రచనల్లో చోటు చేసుకున్నాయి. 'భగవంతునికి బహిరంగ లేఖ' ఖండికలో

**'అన్నింటిలో నీవున్నావని ఆస్తికులంటారేకాని**

**తమలోనే వున్న నిన్ను**

**తప్పుకునే తిరుగుతుంటారు**

**గుళ్ళో నిన్ను చూసినట్టుగా**

**గుండెల్లో చూసుకోలేరు'**

అని ఆత్మవంచన పరతత్వాన్ని సున్నితంగా అధిక్షేపించారు. ఆధునిక కవిత్వంలో అధిక్షేపం రాజకీయ సంబంధిగా కనిపిస్తుంది. ప్రభుత్వ విధానాలు, ఆర్థిక విధానాలు రాజకీయ పక్షాలు, ఎన్నికలు, మంత్రులు, అధికార యంత్రాంగం వ్యక్తులు, పార్టీలు, అవినీతి, వితరణ విలువలు కవిత్వంలో అధిక్షేపానికి గురయ్యాయి.

అధికార యంత్రాంగం నగరం కూడలిలో నిలుచున్న ఎద్దు అని, మంచి నీళ్ళు దొరకని పరిస్థితుల్లో మద్యపానం ఆదాయం పెరిగిందని, జీవ నదులను దేశంలో ఉపయోగించుకోలేక పోతున్నారనీ శ్రీశ్రీ, ఎద్దు మార్కు పరిపాలన అనీ గజ్జెల మల్లారెడ్డి ప్రభుత్వ యంత్రాంగాన్ని అధిక్షేపించారు. కాళోజి 'ప్రజాస్వామ్యం చవట సిద్ధాంతమనెడి

పరిసరాలందరికి ఉరిసరాలండి' అని స్వతంత్ర భారతం గురించి అభ్యుదయం గురించి విమర్శించి ఎద్దేవా చేసారు. గురువు కోడిని తిని శిష్యులను గ్రుడ్డు ముట్టరాదు అన్నట్టుగా పెద్దల నీతి కొనసాగుతుందని రాజకీయ స్థితులను ఎత్తి పొడిచారు.

ఆధునిక కవిత్వంలో మాచిరాజు దేవీ ప్రసాద్, జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి పేరడీలు కవితారీతులను హాస్యం పట్టించాయి. పఠాభి పదాల పరిహాసం, దాశరథి కరుణార్ద్రమైన అధిక్షేపాలు సాహిత్యాన్ని సమాజాన్ని చిత్రవిచిత్ర గతులలో చిత్రీకరించాయి.

జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి (1914–1968) జరుక్ శాస్త్రి పేరుతో శ్రీశ్రీ, విశ్వనాథ కవితలకు పేరడీ రచించి నవ్య కవిత్వంలో అనుకరణ రచనలు చేసి కొత్త మార్గం చేపట్టారు.

శ్రీశ్రీ రచన 'నవ కవిత' కావాలోయ్ నవకవనానికి... అనే గేయాన్ని అనుకరిస్తూ సాహిత్యపరంగా వెక్కిరిస్తూ సరదా పాటలో ఈ విధంగా గిల్లినట్టుగా పేరడీ రాసారు.

**మాగాయి కంది పచ్చడీ**
**ఆవకాయి పెసరప్పడమూ**
**తెగిపోయిన పాత చెప్పులా**
**పిచ్చాడి ప్రలాపం, కోపం**
**వైజాగులో కారాకిల్లీ**
**సామానోయ్ సరదాపాటకు**

దాశరథి కరుణార్ద్ర రస హృదయంతో రాజకీయ నాయకులను అధిక్షేపించిన తీరు ఈ గేయంలో గమనించవచ్చు.

**'చెత్తను మెత్తగా ఎరువు చేసి మెసంగిన చాలు ప్రీతియై**
**ఉత్తమమైన పండ్లనిడుచుండును వృక్షములట్లే ఏవియో**
**రిత్తలు పల్కగానె 'బళిరె' యని మా ప్రజమంత్రి పీటముల్**

**దత్తము చేయుచుండెదరు దాశరథీ కరుణాపయోనిధీ'.**

రంధి సోమరాజు, పేర్వారం జగన్నాథం సమాజంలోని వ్యక్తులను, ప్రజలను మోసగించే నాయకులను అధిక్షేపిస్తూ భవిష్యద్దర్శనం చేయగలిగారు.

**శ్రీ మహావిష్ణువుకు సుస్తీ చేసిందని తెలియగానే వైకుంఠంలో ఏ మూల చూసినా గుసగుసలు ప్రారంభమయ్యాయి. పొలిటీషియన్లు అత్యవసర సమావేశాలు ఏవో జరుపుకుంటున్నారు తగిన వారసుని కోసం అప్పుడే ప్రారంభమైంది గాలింపు** అని పేర్వారం జగన్నాథం రాజకీయ గతులను హరి కొలువు చేసి నాయకుల బహురూపుల వేషాలతో వంచన చేసే తత్త్వాలను అధిక్షేపించారు. సున్నితంగా కొనసాగే అధిక్షేప రచన ఇది.

కందుకూరి వీరేశలింగం రచించిన 'రసికజన రంజనం' ప్రబంధం అభాగ్యోపాఖ్యానములో హేళనాపూర్వకమైన సంఘ సంస్కార దృష్టిని ప్రదర్శించారు. ప్రాచీన కావ్యాలు, చిత్రగర్భ కవిత్వాల పట్ల వ్యతిరేకతతో అర్థంలేని ఊహలతో సరస్వతిని, ఆధునిక సంగీత నాట్యాలతో నారదుడిని హేళను చేసి అవమానిస్తున్నారని భావించి వ్యంగ్య ప్రధానమైన ప్రహసనంగా సరస్వతీ నారద విలాపాన్ని రచించారు. కందుకూరి వీరేశలింగం ప్రహసనాలలో కుల ఆచారాలు, శాఖాభేదాలు మొదలైన అంశాలను అధిక్షేపిస్తూ హాస్య సంభాషణలతో ఆనాటి సాంఘిక దుస్థితికి వ్యథ చెందారు. వేశ్యాభిలాషను, వృద్ధ వివాహాలను ఖండించారు. మద్యపానం అసత్యవాదులు సమాజాన్ని భ్రష్టు పట్టించారనే అంశాలను ప్రహసనాలలో అధిక్షేపిస్తూ వినోదాత్మకంగా వ్యక్తం చేసారు.

అడవి బాపిరాజు 'గంగిరెద్దు' ఖండ కావ్యంలో గ్రామ పరిపాలన వ్యవస్థను అధిక్షేపించారు.

**'మోసము చేసును మునసబుగారు**
**కక్షలు కట్టును కరణంగారు**
**కలిమి కలిగినా కాపులు వీరు**
**డూ డూ డూ డూ యెంకన్నా!'**

గురజాడ సంఘంలోని లోపాలను అధిక్షేపిస్తూ ప్రజలకు ప్రేరణ కలిగించాడు. గురజాడ రచనలలో అధిక్షేపం ప్రేరణ, పురికొల్పు, స్థాపన రూపంలో కనిపిస్తుంది.

**'దేశమును ప్రేమించుకున్నా**
**మంచి యన్నది పెంచుమన్నా**
**వొట్టి మాటలు కట్టి పెట్టోయ్**
**గట్టి మేల్ తలపెట్ట వోయి'**

సంఘంలోని అలసత్వ లక్షణాలను లోపాలను ఎత్తి చూపుతూ ప్రజలకు ప్రేరణ కలిగించాడు గురజాడ. సాహిత్యంలో వెలువడే ప్రతి నవ్య ధోరణి, ప్రక్రియ తత్పూర్వం ఉన్న సాహిత్యంలోని అంశాలనూ, దృక్పథాలను నిరసిస్తూ, వ్యతిరేకిస్తూ వచ్చిన అధిక్షేపాలే.

అధిక్షేప ప్రధానాలైన కావ్యాలలో ప్రథమంగా పేర్కొనదగినది. కూచిమంచి జగ్గకవి 'చంద్రలేఖా' విలాపం శైవేతర మతాలను అధిక్షేపిస్తూ పాల్కురికి సోమన శైవమతాభిమానాన్ని చాటుకున్నాడు. మల్లికార్జున పండితారాధ్యుని పరమత నిరసన అధిక్షేపంగా నడిచింది.

పానుగంటి లక్ష్మీనరసింహారావు సాక్షి వ్యాసాలు వ్యంగ్యం హాస్యంతో కూడుకున్న చమత్కార అధిక్షేపం. తెలుగు భాషను గురించి పానుగంటివారు 'స్వభాష' అనే సాక్షి వ్యాసంలో స్వభాష పట్ల తెలుగు వారికి ఉండవలసిన అవగాహనను నియమాలను అలవరచుకొనమని చెప్పి ఇంగ్లీషు బోధనల వలన బానిసత్వానికి అలవాటు పడ్డారని విమర్శిస్తూ నూతనంగా వస్తున్న ఆంధ్ర గ్రంథాలను విమర్శన బుద్ధితో స్వభాషా పత్రికలను చదవమని కొన్ని నియమాలను తెలియజేసారు. (సాక్షి వ్యాసాలు మొదటి భాగం, పుట 386)

చిలకమర్తి లక్ష్మీనరసింహరావు గణపతి, విశ్వనాథ విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు నవలల్లో శాబ్దిక చమత్కారంతో పాటు అధిక్షేపం కనిపిస్తుంది.

గణపతి నవలలో 'మా కథానాయకునిది లోకము తగులబెట్టు సూర్యవంశముగాదు. దొంగపోటుగ రాత్రులు తిరుగు మచ్చగల చంద్ర వంశము గాదు. ఈ వంశమునకు బ్రహ్మదేవుడే మూల పురుషుడగుట చేత ఇది పవిత్రమైన బ్రహ్మవంశము' అని నాయకుని వంశ చరితకు మూలాన్ని చెప్పే సందర్భంలో హేళన కనిపిస్తుంది. సాహిత్య విద్య చతుర్ముఖులైన విద్వాంసులు లోకమున బెక్కండ్రు కలరు. తర్క వ్యాకరణాది శాస్త్ర పండితులగు పండితులు బెక్కండ్రు గలరు. కాని వారి చేత నా చరిత్రము వ్రాయించుకొన వలయునని కాకిష్టము లేదు. వారు నా చరిత్ర వ్రాయదగరు. వారెంత సేపు భావాతీతములైన యుత్ప్రేక్షలతో అతిశయోక్తులతో కాలక్షేపము చేయుదురు. వారి దృష్టికి వెన్నెలలు, చందమామలు, తామర పువ్వులు మొదలైనవే వచ్చును. కాని నిగర్వమైన నా చరిత్రము వారికి నచ్చదు (గణపతి నవల పుట 9) గణపతి నవలలో కథానాయకుని గణపతి ఆకారం, చదువు లోక రీతి వంటి అంశాలను అధిక్షేపిస్తూ రచన కొనసాగింది.

దళిత సాహిత్యంలో అధిక్షేపం తిరస్కారం, నిరసన, వ్యతిరేక, వెటకార రూపంలో వెల్లడవుతుంది. సనాతన సంప్రదాయాలు, కులమత భేదాలు, ఆచార వ్యవహారాలు, అసమానతలు, అస్పృశ్యత, అస్తిత్వం వంటి అంశాల వ్యక్తీకరణలో సమాజంలో మార్పును, తన ఉనికిని, మనుగడను గుర్తు చేస్తూ తనను అణగదొక్కిన సమాజాన్ని ప్రశ్నిస్తూ రచనలు కొనసాగించారు కవులు చెమటోడ్చి ప్రపంచానికి భుక్తి పెట్టువానికి అన్నము లేదు అని కులమతాలు గీచుకున్న పంజరాన కట్టువడను నేను అని నాలుగు పడగల హైందవ నాగరాజు వేయి తలలతో తన జాతిపై బుసకొడుతుందని జాషువా అధిక్షేపించిన రీతిలో సామాజిక విలువల స్థాపనను ప్రకటిస్తున్నాడు. మద్దూరి నగేష్ బాబు, సతీష్ చందర్, పైడి తెరేష్ బాబు, ఎండ్లూరి సుధాకర్, రత్నాకర్, దార్ల వెంకటేశ్వరరావు, శిఖామణి మొదలైన కవుల రచనలలో విలువల స్థాపన కనిపిస్తుంది.

దార్ల వెంకటేశ్వర రావు బడిలో అమ్మ ఒడిలో(నెమలి కన్నులు) కవితలో విలువల పునర్వీక్షణలో ' **ఈ కులంలో పుట్టడమే మంచిదైంది, అవమానమంటే అర్థమైంది, అందరిని ప్రేమించడం తెలిసింది'** అని కులం పుట్టుక గురించి చెబుతూ, రాగబంధాలని రహదారులుగా మార్చేందుకు నా ప్రయాణమని వ్యక్తం చేసారు. ప్రాంతీయ, ప్రపంచీకరణ సాహిత్యంలోను అధిక్షేపం విలువల స్థాపనకే ప్రాధాన్యమిస్తుంది, చారిత్రక తప్పిదాన్ని గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తుంది.

తెలుగు సాహిత్యంలో అధిక్షేప రచన నిరసనగా తిరస్కారంగా, హేళనగా, కటువుగా, సున్నితంగా, హాస్య వ్యంగ్యంగా, విలువల స్థాపనగా, విమర్శగా, ప్రేరణగా నిలిచింది. ఇది ప్రక్రియగా సుస్థిరతను సంపాదించింది.

* * *